సాక్షి
రాజన్న సిరిసిల్ల

గురువారం । 8 । జూన్ । 2023



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను బుధవారం 20వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవు లు దగ్గర పడుతుండటంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా వస్తున్నారు.



పత్తిధర రూ.7,300

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంటలో పత్తి ధర స్వల్పంగా తగ్గింది. క్వింటాల్‌కు గ రిష్టంగా రూ.7,300, మోడల్ రూ.7,100, కనిష్టంగా రూ.6,800 ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
41.0/30.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశాలు లేవు. ఉక్కపోత అధికంగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

ఎవరికి ‘సహకారం’?

సిరిసిల్ల: జిల్లాలో విద్యుత్ సరఫరా చేస్తూ సెస్(సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ) ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. విద్యుత్ సరఫరా అందిస్తూ.. వినియోగ దారుల నుంచి ప్రతీ నెల బిల్లులు వసూలు చేస్తోంది. అయితే సెస్ సిబ్బందిపై అజమాయిషీ లేక ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే సమయంలో సంస్థ రూ.250 కోట్ల బకాయిల భారం మోస్తోంది. సెస్ స్టోర్స్‌కు సొంత స్థలం కరువైంది. ఈ నేపథ్యంలో నాలుగేళ్ల తర్వాత సంస్థ 49వ వార్షిక మహాసభ గురువారం నిర్వహిస్తున్నారు. సిరిసిల్లలోని పద్మనాయక కల్యాణ మండపంలో గ్రామ ప్రాతినిధ్య సభ్యులతో సమావేశం జరుగుతుంది. ‘సెస్’కు కొత్త పాలకవర్గం కొలువుదీరిన తర్వాత తొలి కీలక సమావేశం నిర్వహిస్తుంది.

- సంస్థపై రూ.250 కోట్ల బకాయిల భారం
- స్టోర్స్‌కు సొంత స్థలం కరువు
- సిబ్బందిపై అజమాయిషీ లేక ఇష్టారాజ్యం
- చేతులు తడపనిదే పనిచేయని క్షేత్రస్థాయి సిబ్బంది
- నేడు ‘సెస్’ మహాసభ





సిరిసిల్ల ‘సెస్’ ఆఫీస్‌లో కూలిన రేలింగ్

ఇదీ సెస్ ప్రత్యేకత

సహకార రంగంలో ఉత్తమ సేవలందిస్తున్న సంస్థగా ‘సెస్’కు పేరుంది. కేంద్ర గ్రామీణ విద్యుదీకరణ సంస్థ(ఆర్ఈసీ) దేశవ్యాప్తంగా ఐదు గ్రామీణ విద్యుత్ సహకార సంఘాలను స్థాపించగా అందులో సిరిసిల్ల సెస్ ఒక్కటి. అన్ని సంస్థలు కాలగమనంలో ఉనికి కోల్పోగా సిరిసిల్ల సంస్థ ఉత్తమ సేవలతో ముందుకెళ్తోంది. వినియోగదారులు అడిగిన వెంటనే కనెక్షన్లు ఇవ్వడం, ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 24 గంటల్లో మరమ్మతు చేసి ఇస్తోంది. 2007 నాటి వరకు ‘సెస్’ పరిధిలో వినియోగదారులే స్వచ్ఛందంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు శ్రమదానం చేసేవారు. ఇప్పుడు కాంట్రాక్టు వ్యవస్థ మొదలైంది.

మహాసభ తీర్మానాలు ఎంతో కీలకం

సంస్థలో గ్రామ ప్రాతినిధ్య సభ్యుల మహాసభ తీర్మానాలు ఎంతో కీలకం. గురువారం జరిగే సమావేశంలో బైలా మార్పులు ముఖ్యమైంది. ఎన్పీడీసీఎల్ తరహాలో రైతులకు విద్యుత్ కనెక్షన్ల మంజూరు సమ్మతమే అయినా స్మార్ట్‌మీటర్లు, ఉద్యోగుల సర్వీసు నిబంధనలు, కొత్తస్టాఫింగ్ ప్యాటర్న్ అమలుపై సందేహాలు ఉన్నాయి. చర్చించకుండా మహాసభ ఆమోదిస్తే తీవ్రనష్టం జరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఉన్న సిబ్బందితో పూర్తి స్థాయిలో పనిచేయించే వ్యవస్థ లేదు. కొత్తగా అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగులను నియమించుకునేందుకు మహాసభ ఆమోదానికి తేవడం అంటే మరోసారి అవినీతికి తెర తీసినట్లు అవుతుంది. మహాసభలో సభ్యులు దీనిపై చర్చించాలి.

సంస్థకు సవాళ్లు ఇవీ..

- సెస్‌కు పరికరాలు భద్రపరుచుకునే స్టోర్స్ లేదు. సిరిసిల్ల మానేరుతీరంలోని సెస్ స్టోర్స్‌ను రైతుబజారుకు ఇవ్వడంతో ఇప్పుడు అద్దె భవనంలో కొనసాగుతోంది.
- సిరిసిల్లలోని ‘సెస్’ ఆఫీస్ భవనం శిథిలావస్థకు చేరింది. కొత్త మండలాల్లో సంస్థకు ఆఫీస్‌లు లేవు. కొన్ని మండలాల్లో భవనాలు ఉన్నా పరాధీనమయ్యాయి.
- గతంలో పనిచేసిన పాలకవర్గ వర్గాలు అవినీతికి పాల్పడడం, కాంట్రాక్టర్లుగా అవతారం ఎత్తడం, ట్రాన్స్‌పార్మర్ల కొనుగోలు నుంచి సిబ్బంది ప్రమోషన్ల వరకు అవినీతికి పాల్పడ్డారు. దీనిపై సహకార చట్టం 51 ప్రకారం విచారణ పెండింగ్‌లో ఉంది.
- ‘సెస్’లో క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. డబ్బులు ఇవ్వనిదే ఏ పని చేయడం లేదు.
- సంస్థలో ఉద్యోగులు చాలా మంది ప్రతిభ ఆధారంగా కాకుండా కారుణ్య నియామకాలు, పాలకవర్గానికి డబ్బులు ఇచ్చి నియమితులైన వారు కావడం, దశాబ్దాల తరబడి ఒకే చోట పాతుకు పోవడంతో గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారు. సొంత జిల్లాలోనే ఉద్యోగం కావడంతో విధులను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.
- సంస్థ ప్రారంభంలో 1.20 లక్షల కనెక్షన్లు ఉన్న కాలంలో 425 మంది సిబ్బంది ఉండేవారు. ఇప్పుడు విద్యుత్ సర్వీసులు 2.80 లక్షలకు చేరినా.. సిబ్బంది 355 మంది మాత్రమే ఉన్నారు. ఉన్న వారితో పకడ్బందీగా పనిచేయించే వ్యవస్థ లేదు.
- మండల కేంద్రాల్లోనే అన్ని రకాల విద్యుత్ సేవలు అధికారుల నుంచి వినియోగదారులకు లభించాలి. ప్రతి దానికి సిరిసిల్ల వరకు రాకుండా మండల కేంద్రాల్లోనే అన్ని పనులు జరిగేలా చూడాలి.

మంత్రి కేటీఆర్‌పైనే ఆశలు

సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావుపైనే సంస్థ మనుగడ ఆధారపడి ఉంది. సెస్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు మంజూరుచేస్తే ఆర్థికంగా బలపడుతుంది. కొత్తగా ఎన్నికైన పాలకవర్గం సంస్థ పనితీరుపై నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులసేవలో, వినియోగదారుల సేవలు మరింత సమర్థంగా ముందుకు నడిపించాల్సిన అవసరం ఉంది. ‘సెస్’ పరిధిలో సౌరవిద్యుత్ ఉత్పత్తికి ఊతమివ్వాలి. రైతులను ప్రోత్సహించాలి. జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు సంస్థ ముందుకుసాగాలి. ఆ దిశగా ‘సెస్’ను ప్రోత్సహిస్తే సంస్థకు పూర్వవైభవం వస్తుంది.

‘సెస్’ స్వరూపం

స్థాపితం: 1970 నవంబరు 1
విద్యుత్ కనెక్షన్లు : 2,80,106
ఉద్యోగులు : 355
వ్యవసాయ కనెక్షన్లు : 78,570
మరమగ్గాల కనెక్షన్లు : 8,265
గృహవిద్యుత్ కనెక్షన్లు : 1,59,928
పరిశ్రమలు : 1,557
దుకాణాలు : 13,138
ఇతర కనెక్షన్లు : 18,648
విద్యుత్ బకాయిలు: రూ.250 కోట్లు

న్యూస్‌రీల్

యారన్ సబ్సిడీ చెల్లించాలి

- పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్



సిరిసిల్లఅర్బన్: బతుకమ్మ చీరలకు సంబంధించిన పదిశాతం యారన్ సబ్సిడీని కార్మికులకు చెల్లించాలని కోరుతూ బుధవారం పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేనేత జౌళీశాఖ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఒక్క రోజు దీక్షలో పవర్ లూమ్ కార్మికులు పెద్ద ఎత్తున దీక్షలో పాల్గొన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ 2020కి సంబంధించి యారన్ సబ్సిడీని చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. చేనేత జౌళీశాఖ ఏడీ సాగర్ దీక్షా శిబిరానికి వచ్చి కార్మికులతో మాట్లాడారు. తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మోర అజయ్, రాజశేఖర్, లక్ష్మణ్, శంకర్, దేవదాస్ ఉన్నారు.

ప్రజాగర్జనను విజయవంతం చేయండి



తంగళ్లపల్లి(సిరిసిల్ల): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈనెల 11న నిర్వహించే ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. తంగళ్లపల్లిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ధరణితో 8 లక్షల మంది రైతులు నష్టపోయారన్నారు. రైతుబంధు పేరుతో భూస్వామ్య బంధు తెచ్చారని ఆరోపించారు. ప్రజాగర్జన సభ పోస్టర్ ఆవిష్కరించారు. రమేశ్, సోమ నాగరాజు, రాజేందర్, మల్ల య్య, బాలరాజు, శంకర్, ఆనంద్ పాల్గొన్నారు.

బాలుడిపై వీధికుక్కల దాడి



సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు ఆడెపు విశ్వక్‌పై మంగళవారం రాత్రి వీధికుక్క దాడి చేసింది. ఈ దాడిలో గాయపడ్డ బాలుడిని కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. మళ్లీ బుధవారం అదే కుక్కతోపాటు మరో నాలుగు వీధికుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఈ దాడిలో బాలుడి పొట్ట, వీపు, కాళ్లపై గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించి మరోసాకి చికిత్స చేయించారు. వీధుల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, పలుమార్లు మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు

వేములవాడరూరల్: ప్రైవేటు పనులకు ప్రభుత్వ నిధులను కాజేసిన సర్పంచ్‌కు జిల్లా అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ సర్పంచ్ నాగుల వేణుగోపాల్ గ్రామంలోని ప్రైవేటు రోడ్డు పనులకు గ్రామపంచాయతీ నుంచి రూ.1,65,168 దుర్వినియోగం చేసినట్లు అదే గ్రామానికి చెందిన ఏడుమ్యాకల మధుకర్ గతంలో ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై మండల స్థాయి అధికారులు విచారణ చేపట్టి జిల్లా స్థాయి అధికారులకు నివేదిక ఇచ్చారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నోటీసు అందిన ఏడు రోజుల్లోగా సమాధానం చెప్పాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉదార కాలువ పనులు పరిశీలన



సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని ఉదార కాలువ పునర్ నిర్మాణ పనులను ఓఎస్డీ మహేందర్ తోపాటు టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ బుధవారం పరిశీలించారు. వెంకంపేటలోని 40 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనుల తోపాటు అభివృద్ధి పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, బీఆర్ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు ఉన్నారు.

నక్సలైట్ల పేరుతో బెదిరిస్తే చర్యలు

- డీఎస్పీ నాగేంద్రచారి
- ఇద్దరి అరెస్ట్

వేములవాడ: జనశక్తి నక్సలైట్ల పేరుతో ప్రజలను బెదిరిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ నాగేంద్రచారి హెచ్చరించారు. వేములవాడలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నక్సలైట్లమంటూ బెదిరింపులకు పాల్పడ్డ వేములవాడకు చెందిన మునుకా కుంటయ్య, సిరిసిల్లకు చెందిన పోకల సాయికుమార్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిద్దరు వేములవాడకు చెందిన తిరుపతికి భూమి అమ్ముతామని రూ.10లక్షలు తీసుకొని మోసం చేశారని తెలిపారు. అంతేకాకుండా జనశక్తి మాజీ నక్సలైట్ అని అదనంగా తమకే డబ్బులు ఇవ్వాలని, లేకుంటే చంపుతామని బెదిరించారని వివరించారు.

‘సాయికుమార్‌ను విడుదల చేయాలి’

సిరిసిల్లక్రైం: న్యాయవాద విద్యార్థి, పీడీఎస్‌యూ మాజీ నాయకుడు పోకల సాయికుమార్ అరెస్ట్ అక్రమమని, వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల కమిటీ రాష్ట్ర కన్వీనర్ గురువారెడ్డి, రాష్ట్ర కో–కన్వీనర్ కొండా నాగేశ్వర్, ప్రొఫెసర్ వినయ్‌బాబు, రఘునందన్ ప్రకటనలో కోరారు. పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థిగా, ప్రస్తుత ఎల్ఎల్‌బీ విద్యార్థిగా నిరుద్యోగ సమస్యలపై గళం విప్పడంలో తప్పేంటని ప్రశ్నించారు. ప్రెస్‌మీట్ జరిగిన తర్వాత భోజనం చేస్తున్న సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని తప్పుడు కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. అక్రమ కేసుల విషయంలో హోంమంత్రి, డీజీపీ జోక్యం చేసుకోవాలని కోరారు.

జాతీయస్థాయి క్రీడాకారునికి అభినందన



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లగొల్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి ముత్యాల మనోజ్ వాలీబాల్ పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. మనోజ్‌ను బుధవారం జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సీఐ మొగిలి, మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ కొండాపురం బాల్‌రెడ్డి సన్మానించారు. పశ్చిమబెంగాల్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున మనోజ్ పాల్గొన్నాడు. ఎంపీడీవో చిరంజీవి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాపురెడ్డి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

నేడు సిరిసిల్లలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

- మూడు రోజులపాటు నిర్వహణ



శిక్షణ పొందిన మహిళలతో జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్

సిరిసిల్ల: సిరిసిల్లలో తొలిసారి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను మత్స్యశాఖ నిర్వహిస్తోంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురు, శుక్ర, శనివారాల్లో మూడు రోజులపాటు సిరిసిల్ల మానేరుతీరంలోని రైతుబజారులో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 24 మంది మహిళలు హైదరాబాద్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం, హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్‌లో ఇప్పటికే చేపలు, రొయ్యల వంటకాలపై శిక్షణ పొందారు. చేపలు, రొయ్యల వంటలను తయారు చేయడంలో నిష్ణాతులైన చెఫ్‌లతో శిక్షణ ఇప్పించారు. నోరూరించే వెరైటీ ఫిష్‌ఫుడ్స్‌పై శిక్షణ పొందిన మహిళలు సిరిసిల్లలో తమదైన శైలిలో వివిధ రకాల ఫిష్‌ఫుడ్‌ను తయారుచేసి స్టాల్స్‌లో అమ్మకానికి ఉంచుతారు. సంప్రదాయ రుచులతోపాటు 22 రకాల వంటలను ఈ ఫెస్టివల్ కోసం సిద్ధం చేస్తున్నారు. మూడు రోజులపాటు సిరిసిల్లలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు మంత్రి కేటీఆర్ హాజరుకానున్నారు. మంత్రి కేటీఆర్ గురువారం ఉదయం 11 గంటలకు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన అనంతరం స్టాళ్లను సందర్శిస్తారు. సాయంత్రం కొర్రమీను చేపల పెంపకంపై సెమినార్ నిర్వహించనున్నారు. ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో రెండో రోజు సాయంత్రం 5 గంటలకు చేపల పెంపకం–వ్యాధుల నివారణపై సెమినార్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు చేపలు, రొయ్యల వంటకాల పోటీలు ఉంటాయి. రాత్రి 8 గంటలకు బహుమతుల ప్రదానం చేయనున్నారు. మూడో రోజు శనివారం సాయంత్రం 5 గంటలకు వనామీ రొయ్యల సాగుపై సెమినార్, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు చేపలు, రొయ్యల వంటకాలలో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులతో కార్యక్రమం ముగియనుంది.

ఉత్సవాలు చేసుకునే అర్హత ప్రభుత్వానికి లేదు

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడరూరల్: ఉత్సవాలు జరుపుకునే అర్హత ప్రభుత్వానికి లేదని... ముందుగా ప్రాజెక్టులు పూర్తి చేసి చూపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వం సాగునీటి ఉత్సవాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బుధవారం వేములవాడ మండలం చెక్కపల్లి నుంచి మర్రిపల్లి రిజర్వాయర్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.1730 కోట్లతో ఫాజుల్‌నగర్ వద్ద నిర్మించిన ప్రాజెక్టు నుంచి వేములవాడ నియోజకవర్గానికి ఎల్లంపల్లి నీరును నింపేందుకు ఆయన చేసిన ప్రయత్నమే నేడు కొనసాగిందన్నారు. ఇప్పటి వరకు మర్రిపల్లి ప్రాజెక్టు, కోనరావుపేట మండలం లచ్చంపేట ప్రాజెక్టు, లింగంపేట దగ్గర పైప్‌లైన్ పనులు పూర్తి కాలేదన్నారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టులో ఇప్పటి వరకు జానెడు మొరం తీయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెండింగ్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని కోరారు. పార్టీ వేములవాడరూరల్ అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు సంగ స్వామి, ఎదురుగట్ల సర్పంచ్ సోయినేని కరుణాకర్, నాయకులు బొడ్డు రాములు, రొండి రాజు, దాన వేణు, బండ శ్రీనివాస్, బత్తిని ఎల్లయ్య, మానుపాటి పర్శరాములు, జాగిరి సురేష్, చిలుక ప్రభాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, చందుర్తి మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, కూరగాయల కొమురయ్య, కనికరపు రాకేశ్, చిలువేరి శ్రీనివాస్‌గౌడ్, నాగుల విష్ణు, సాయిని అంజయ్య, కూర దేవయ్య ఉన్నారు.

సాగు పండుగైంది

- జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ
- ఘనంగా సాగునీటి దినోత్సవం



తెలంగాణ కోటి ఎకరాల మాగాణ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు, జిల్లా అధికారులు

సిరిసిల్ల: ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయం దండుగ అన్న స్థితి నుంచి స్వరాష్ట్ర సాధన తరువాత సాగును పండుగలా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో సాగునీటి దినోత్సవం నిర్వహించారు. అరుణ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ముందుచూపుతో వ్యవహరించడంతోనే రాష్ట్రంలో సాగునీటి రంగం అభివృద్ధి చెందిందన్నారు. కరెంట్ కష్టాలు దూరంకావడంతోపాటు సాగునీరు, తాగునీరు అందుబాటులో ఉండడం గొప్ప పరిణామమని పేర్కొన్నారు. చెరువులు, బోరుబావుల కింద కోటి 35 లక్షల ఎకరాలు సాగులో ఉండడమే ఇందుకు నిదర్శనం అన్నారు. మండు వేసవి లోనూ ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయన్నా రు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, 24 గంటల ఉచిత కరెంటు, మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలతో రైతుల ఆత్మహత్యలు తగ్గాయన్నారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, పవర్ లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య మాట్లాడారు. అనంతరం తెలంగాణ కోటి ఎకరాల మాగాణ శీర్షికన రూపొందించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ప్యాకేజీ 9 ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



వేములవాడ: ప్రజల సౌకర్యం కోసం చేపట్టిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. వేములవాడ పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను బుధవారం పరిశీలించారు. రాజన్న గుడిచెరువు, ఖాళీస్థలం, భక్తులు విడిది చేసే ప్రాంతాలు, శామకుంటలో కూరగాయల మార్కెట్, వీఐపీ రోడ్డు పనులు, మూలవాగు తీరాన నిర్మించే వాల్, వాకింగ్‌ట్రాక్, స్కూల్ పనులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఏఈ నర్సింహస్వామి, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11న సాహిత్యోత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం ఆవిష్కరించారు. జిల్లా పౌరసంబంధాల అధికారి మామిండ్ల దశరథం, ప్రణాళికాధికారి పీబీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువయ్యేందుకే ఠాణా దివస్

- ఎస్పీ అఖిల్ మహాజన్
- వేములవాడలో 76 అర్జీల స్వీకరణ



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ: ప్రజల సమస్యలు పరిష్కరించడం, వారికి మరింత చేరువయ్యేందుకే ప్రతీ నెల ఠాణా దివస్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. వేములవాడటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఠాణాదివస్ నిర్వహించారు. 76 అర్జీలు స్వీకరించి వారికి సత్వర న్యాయం జరిగేలా చొరవ తీసుకోవాలని టౌన్ సీఐ వెంకటేశ్, డీఎస్పీ నాగేంద్రచారీలను ఆదేశించారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ గ్రామాల్లో కమ్యూనిటీ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కుటుంబాలకు సంబంధించిన అంశాలను షీటీమ్, సఖీ సెంటర్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. భూసంబంధిత సమస్యలుంటే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేములవాడరూరల్, ఎల్లారెడ్డిపేటలో నిర్వహించి ఠాణాదివస్‌లో వచ్చిన 15 ఫిర్యాదులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. మరికొన్ని రాజీ కుదిర్చినట్లు చెప్పారు. డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ వెంకటేశ్, ఎస్సైలు వెంకట్రాజం, రఫీక్‌ఖాన్ పాల్గొన్నారు.

గ్రూప్–1 ప్రిలిమ్స్‌కు ఏర్పాట్లు

సిరిసిల్లక్రైం: జిల్లాలో గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఈనెల 11న నిర్వహించే గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షపై జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులు, కేటాయించిన అధికారులను తప్ప ఇతరులను అనుమతించొద్దని సూచించారు. జిల్లాలో 4,261 మంది పరీక్ష రాయబోతున్నట్లు తెలిపారు. తాగునీటి సదుపాయం, సీసీ కెమెరాలు, లైటింగ్ ఉండేలా చూడాలన్నారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష కొనసాగుతుందని, ఉదయం 8.30 నుంచి 10.15 గంటల వరకే అభ్యర్థులను అనుమతిస్తారని, తర్వాత అనుమతించబోరని తెలిపారు. స్పెషల్ బ్రాంచ్ సీఐ కరుణాకర్, సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్ ఉన్నారు.

క్లుప్తంగా

రాజన్న ఆలయ పీఆర్వో కూతురు పెళ్లిలో ఎమ్మెల్యే



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే

వేములవాడ: స్థానిక రాజన్న ఆలయ పీఆర్వో ఉపాధ్యాయుల చంద్రశేఖర్ కూతురు రుత్విక-పృథ్విరాజ్‌ల వివాహం బుధవారం కరీంనగర్‌లో జరిగింది. ఈ వేడుకకు ఎమ్మెల్యే రమేశ్ బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తదితరులు హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు.

సెల్‌ఫోన్ రికవరీ



ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై లక్ష్మారెడ్డి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సెల్‌ఫోన్ పోయినా, చోరీకి గురైనా సీఈఐఆర్ ద్వారా గుర్తించి, బాధితులకు అందిస్తున్నామని తంగళ్లపల్లి ఎస్సై లక్ష్మారెడ్డి అన్నారు. ఇందిరానగర్‌కు చెందిన కడమంచ రాజశేఖర్ ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని తెలిపారు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా రికవరీ చేసి, బాధితుడికి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు చెప్పారు. ఫోన్ పోతే ఠాణాలో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

9న జాతీయ అప్రెంటిస్‌షిప్ అవగాహన సదస్సు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 9న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ, రీజినల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (ఆర్‌డీఎస్‌డీఈ) ఆధ్వర్యంలో జాతీయ అప్రెంటిస్‌షిప్ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి.కనకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లాతోపాటు కరీంనగర్, సిద్దిపేట, జగిత్యాల జిల్లాలకు చెందిన ఐటీఐ పూర్తి చేసినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్టాక్ హోల్డర్స్, ప్రముఖ ఇండస్ట్రియల్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

పేదల ఆకలి తీర్చిన స్వచ్ఛంద సంస్థలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలో బుధవారం జరిగిన ఓ ఫంక్షన్‌లో మిగిలిన భోజనాన్ని చైతన్య, ధరణి స్వచ్ఛంద సంస్థలు సేకరించి, రాజీవ్‌నగర్‌లో ఆకలితో అలమటిస్తున్న పేదలకు అందించాయి. 150 మందికి పైగా ఆహారం పంపిణీ చేసినట్లు సంస్థల సభ్యులు వేముల మార్కండేయులు, జయసింహారెడ్డి, రాంబాబు తెలిపారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నోటీసు అందజేస్తున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా పంచాయతీ అధికారికి తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. జీపీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలన్నారు. కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులు నియమించి, పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలన్నారు. లేని యెడల జూన్ 21 తర్వాత నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలిపారు. నాయకులు రేసు రాజయ్య, మల్యాల నర్సయ్య, అన్నల్‌దాస్ గణేశ్ పాల్గొన్నారు.

అడవి బిడ్డలు.. ఆటల్లో మెరికలు

- మండల, జిల్లాస్థాయిల్లో రాణించి, రాష్ట్రస్థాయికి ఎంపికవుతున్న వైనం
- శిక్షణ కోసం ఎదురుచూపు
- వీర్నపల్లి మండలంలోని అటవీ గ్రామాల క్రీడాకారుల పరిస్థితి



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

వీర్నపల్లి(సిరిసిల్ల): వారంతా అటవీ గ్రామాలకు చెందిన యువత. ఆటల్లో సొంతంగా సాధన చేస్తున్నారు. పలు క్రీడల్లో రాణించాలన్న కోరిక ఉన్నా విజయం సాధించడానికి అవసరమైన శిక్షణకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అయినా తాము ఎంచుకున్న లక్ష్య సాధన కోసం అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని, మండల, జిల్లా స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. ఇటీవల సీఎం కప్-2023 పేరిట నిర్వహించిన వివిధ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు వీర్నపల్లి మండలంలోని వీర్నపల్లి, పదిర, అడవి పదిర, గర్జనపల్లి, వన్‌పల్లి, కంచర్ల, మద్దిమల్ల, శాంతినగర్, అల్మాస్‌పూర్ గ్రామాల క్రీడాకారులు. అక్కడ విజయం సాధించలేకపోయినా తమకున్న క్రీడాసక్తికి ప్రభుత్వం ఆర్థిక వనరులు సమకూర్చి, శిక్షణ అందిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సత్తా చాటుతామని అంటున్నారు.

కబడ్డీ అంటే ఇష్టం



నాకు కబడ్డీ అంటే ఇష్టం. సీఎం కప్ క్రీడల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. అమ్మానాన్న వ్యవసాయం చేస్తున్నారు. క్రీడల్లో శిక్షణ పొందాలంటే డబ్బుల్లేవు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలి.

– బోద సుష్మిత, కబడ్డీ క్రీడాకారిణి, వీర్నపల్లి

ఐదుసార్లు రాష్ట్రస్థాయిలో..



నేను ఐదుసార్లు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న. అక్కడికి వచ్చే క్రీడాకారులు మెరుగైన శిక్షణ పొంది, రావడం గమనించా. అది మాకు అందుబాటులో లేకపోవడం బాధాకరం. ప్రోత్సాహం అందిస్తే జాతీయస్థాయిలో రాణిస్తా.

– గెంటె పూజిత, కబడ్డీ క్రీడాకారిణి, పదిర

జాతీయ పోటీల్లో పాల్గొన్న



నేను మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాను. పీఈటీల శిక్షణతో జాతీయ కబడ్డీ పోటీల్లో పాల్గొన్న. ఇప్పుడు ఇండియా టీంలో ఎంపిక స్థాయిలో ఉన్న. అక్కడ రాణించాలంటే శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం సహకరించాలి.

– జి.పావని, కబడ్డీ, శాంతినగర్

సీఎం కప్ పోటీలకు మొదటిసారి..



నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఇష్టం. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు మొదటిసారి ఎంపికవడం ఆనందంగా ఉంది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని పోటీలకు ఎంపికై, విజయం సాధించేందుకు శ్రమిస్తా.

– వి.సంధ్య, ఖోఖో క్రీడాకారిణి, పదిర

శిక్షణ అందడం లేదు



నేను పాఠశాలలో ఆడినప్పుడు వచ్చిన విజయం కంటే ఇప్పుడు జిల్లాస్థాయిలో రాణించి, రాష్ట్రస్థాయిలో ఆడటం చాలా సంతోషాన్ని ఇచ్చింది. మాకు క్రీడా పోటీల్లో శిక్షణ అందడం లేదు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– అభినయశ్రీ, ఖోఖో క్రీడాకారిణి, అల్మాస్‌పూర్

క్రీడాకారులను ప్రోత్సహించాలి



నేను వ్యాయామ విద్యలో డిగ్రీ పూర్తి చేసి, విజ్ఞాన్ స్కూల్‌లో పీఈటీగా పని చేస్తున్న. కొంత మంది విద్యార్థులకు క్రీడాపోటీల్లో శిక్షణ ఇస్తున్న. సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు అవకాశం వచ్చింది. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి.

– దాసారం రాకేశ్, ప్రైవేటు పీఈటీ, వీర్నపల్లి

సర్కార్ బడిలోనే చేర్పించండి

- బడిబాటలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



బడిబాటలో ఆగయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పోషక పదార్థాలతో కూడిన మధ్యాహ్న భోజనం అందుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బుధవారం జెడ్పీ పాఠశాల సిబ్బంది, మండల నాయకులతో కలిసి బడిబాటలో పాల్గొన్నారు. ఆగయ్య మాట్లాడుతూ మన ఊరు- మన బడిలో భాగంగా ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంత్రి కేటీఆర్ రూ.8కోట్లు మంజూరు చేయగా.. పనులు పూర్తవుతున్నాయన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. సెస్ డైరెక్టర్‌లు వరుస కృష్ణహరి, మాడుగుల మల్లేశంయాదవ్, ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, ఉస్మాన్ బాయి, ఎంపీటీసీ పందిళ్ల నాగరాణి, హెచ్‌ఎంలు దబ్బెడ హన్మాండ్లు, కుబేరస్వామి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, నాయకులు నంది కిషన్, పందిళ్ల పర్శరాములుగౌడ్, ఎలగందుల నర్సింలు, ఎండపల్లి పర్శరాములు, కటుకం రామచంద్రం పాల్గొన్నారు.

ఠాణాకు చేరిన వీవోఏల పంచాయితీ

- విధుల్లో చేరినవారిపై సమ్మె చేస్తున్నవారి ఆగ్రహం
- కాసులు తీసుకున్నారని ఆరోపణ

చందుర్తి(వేములవాడ): తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ నిరవధిక సమ్మెకు దిగిన ఐకేపీ వీవోఏల మధ్య ఐక్యత లోపించింది. చివరికి వారి పంచాయితీ ఠాణాకు చేరింది. వివరాల్లోకి వెళ్తే.. చందుర్తి మండలంలో 30 మంది వీవోఏలు ఉన్నారు. వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు స్వరూప, మరో ఐదుగురు విధుల్లో చేరుతున్నట్లు మంగళవారం ఐకేపీ ఏపీఎం రజితకు జాయినింగ్ లెటర్లు అందించారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన మిగతా 24 మంది వీవోఏలు కాసులు తీసుకొని, సమ్మెను నీరుగార్చారంటూ ఆరోపించడంతోపాటు దూషించారు. దీంతో స్వరూప, ఎన్గల్ వీవోఏ శేషాద్రి బుధవారం పోలీసులను ఆశ్రయించారు. తాను మాట్లాడుతానంటూ ఎస్సై రమేశ్ గురువారం ఇరువర్గాల వారిని ఠాణాకు రావాలని సూచించినట్లు తెలిసింది.

వేములవాడ ఆస్పత్రికి లక్ష్య సర్టిఫికెట్



సర్టిఫికెట్ అందుకున్న వైద్య బృందం

వేములవాడరూరల్: వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రికి నేషనల్ హెల్త్ మిషన్ వారు లక్ష్య సర్టిఫికెట్ అందించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ మహేశ్‌రావు బుధవారం తెలిపారు. ప్రతీ విభాగంలో 100 మార్కులకు గాను 86 శాతంతో సర్టిఫికెట్ పొందామన్నారు. లేబర్ రూమ్, మెటర్నిటీ ఆపరేషన్ థియేటర్‌లో గర్భిణులకు అందిస్తున్న సేవలు, సర్వీస్ ప్రావిజన్, పేషెంట్ రైట్స్, ఇన్‌పుట్స్, సపోర్ట్ సర్వీస్, క్లినికల్ సర్వీసెస్, ఇన్ఫెక్షన్ కంట్రోల్, క్వాలిటీ మేనేజ్‌మెంట్, అవుట్ కమ్స్ అంశాలను నేషనల్ టీం పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఈ సర్టిఫికేషన్‌తో ఆస్పత్రి అభివృద్ధికి ఏడాదికి రూ.3 లక్షల చొప్పున మూడేళ్లపాటు నగదు బహుమతి అందిస్తారని తెలిపారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రోత్సాహం, వైద్యులు, సిబ్బంది సహకారంతో సర్టిఫికెట్ సాధించినట్లు పేర్కొన్నారు.

'కొనుగోళ్లు పూర్తవకపోవడం సిగ్గుచేటు'



రైతులతో మాట్లాడుతున్న ఉమేశ్‌రావు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి, 2 నెలలు గడుస్తున్నా కొనుగోళ్లు పూర్తవకపోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చీటి ఉమేశ్‌రావు అన్నారు. బుధవారం తంగళ్లపల్లి మండలంలోని ఓబులాపూర్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మళ్లీ మోసం చేస్తోందని ఆరోపించారు. తాలు, తరుగు పేరుతో రైతులను నట్టేట ముంచుతున్న వారికి వారి ఉసురు తగులుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు మినహా ఎవరూ బాగుపడలేదని ఎద్దేవా చేశారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి మంత్రి కేటీఆర్‌ను గెలిపిస్తే రైతులు, నిరుద్యోగులు, కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు నీళ్లిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. అప్పర్ మానేరుకు రూ.3 కోట్లు వెచ్చించి, కనీసం పూడిక కూడా తీయలేదన్నారు. జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు. నాయకులు చుక్క రాజశేఖర్, కొత్త రవి గౌడ్, కటకం రాజశేఖర్, పాలకుర్తి అజయ్, ఓగుగంటి తిరుపతి, బత్తుల మల్లేశం, గోగు రాములు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు బాసటగా సీఎం కేసీఆర్

- ప్రాజెక్టుల నిర్మాణంతో పెరిగిన భూగర్భజలాలు, పంటల దిగుబడి
- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: సీఎం కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మించడం వల్లే నేడు తెలంగాణలో భూగర్భ జలాలు వృద్ధి చెందడంతోపాటు పంటల దిగుబడి పెరిగిందని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. ఆయన రైతుకు బాసటగా నిలుస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక ఓ ఫంక్షన్‌హాలులో బుధవారం సాగునీటి దినోత్సవం ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించబోతున్నట్లు తెలిపారు. మా నాన్న స్వర్గీయ రాజేశ్వర్‌రావు నిమ్మపల్లి ప్రాజెక్టు వంద రోజులపాటు పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. కానీ ఆ రోజుల్లో కేవలం 2,500 ఎకరాలకు మాత్రమే నీరందించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే ఆయన కల నిజం కాబోతుందన్నారు. వర్షపు నీటిని ఒడిసిపడితే విద్యుదుత్పత్తి పెరుగుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో ఉపాధి కోల్పోయిన ముంపు గ్రామాల వారికి దళితబంధు ద్వారా వంద యూనిట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జెడ్పీటీసీ సభ్యులు మ్యాకల రవి, నాగం భూమయ్య, గట్ల మీనయ్య, ఏశ వాణి, ఎంపీపీలు ఉమాదేవి, రేవతి, స్వరూప, చంద్రయ్య, లావణ్య, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు చెరువుల పండుగ..

వేములవాడ రాజన్న గుడి చెరువులో గురువారం సాయంత్రం 5 గంటలకు చెరువుల పండుగ జరపనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి తెలిపారు. ముందుగా కట్ట మైసమ్మకు బోనం మొక్కులు చెల్లించి, తర్వాత గుడి చెరువు కట్టపై సాంస్కృతిక కార్యక్రమాలు, సమావేశం ఉంటాయన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పద్మశాలీ సంఘానికి త్వరలో ఎన్నికలు



మాట్లాడుతున్న శ్రీనివాస్

సిరిసిల్లకల్చరల్: పద్మశాలీ సంఘం రాష్ట్ర శాఖకు త్వరలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రాత్రి సిరిసిల్లలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మశాలీ సంఘం పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా నూతనంగా భారీ సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. ఉపాధ్యక్షుడు లగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పద్మశాలీ సంఘానికి జరగనున్న ఎన్నికల్లో పద్మశాలీ సామాజిక వర్గం సత్తా చాటాలని సూచించారు. అధిక సంఖ్యలో సభ్యత్వాలతోపాటు రాజకీయ ప్రయోజనాలను జనాభా ప్రకారం పొందేందుకు ఈ ఎన్నికలు మంచి అవకాశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, నాయకులు గాజుల బాలయ్య, ఆడెపు రవీందర్, వస్త్రోత్పత్తి రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

'భూ కబ్జాకు ప్రయత్నిస్తున్నరు'



మాట్లాడుతున్న బాధితుడు లక్ష్మణ్

సిరిసిల్లఅర్బన్: ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కొత్తపల్లి లక్ష్మణ్ పోలీసులను కోరాడు. బుధవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో మాట్లాడాడు. తంగళ్లపల్లి మండలంలోని కస్బెకట్కూర్‌కు చెందిన తాను గ్రామంలోని 382, 383, 384 సర్వే నంబర్లలో 23 గుంటల భూమిని 1997లో కొనుగోలు చేసినట్లు తెలిపాడు. అప్పటినుంచి సాగు చేసుకుంటునాన్నని అన్నాడు. ఆరు రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తమ భూమిలోకి ప్రవేశించి, ట్రాక్టర్లతో దున్ని, మట్టి పోయడానికి ప్రయత్నించారని పేర్కొన్నాడు. అది చూసిన తాము మా భూమిలో ఎందుకు దున్నుతున్నారని అడగ్గా కులం పేరుతో దూషించి, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించాడు. అక్కడే ఉన్న రేకుల షెడ్డును సైతం కూల్చివేశారని తెలిపాడు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని కోరాడు.



చల్లంగా చూడు తల్లీ

కోనరావుపేట(వేములవాడ): పిల్లపాపలను చల్లంగా చూడు తల్లీ.. అంటూ కోనరావుపేట మండలంలోని నిజామాబాద్‌లో బుధవారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు తీశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు.

శిశువు ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది



పాపకు చికిత్స అందిస్తున్న సిబ్బంది

సిరిసిల్లటౌన్/తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సంధ్య రెండో కాన్పు కోసం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి, బుధవారం ఆడబిడ్డకు జన్మించింది. ఆ శిశువు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తి, అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ వెళ్లాలని సూచించారు. బాధిత కుటుంబసభ్యులు 108కి సమాచారం అందించగా సిబ్బంది అనిల్‌కుమార్, పైలట్ పెద్ది శ్రీనివాస్ వచ్చి, పాపను కరీంనగర్ తరలించే క్రమంలో ఆక్సిజన్ అందిస్తూ ఉన్నారు. పాప కళ్లు తెరవడంతో కుటుంబసభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. సరైన సమయంలో శిశువు ప్రాణాలు కాపాడారంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని మహబూబపూర్ ప్రాంతానికి చెందిన ఎండీ.అజీల్‌ను చంపుతానని బెదిరించిన ఎండీ.సల్మాన్‌పై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సల్మాన్ కొంతకాలంగా అజీల్ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. సల్మాన్‌కు తన భార్యతో గొడవలు జరగడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఇంటి యజమాని అజీల్‌కు తన అత్తింటివారితోపాటు కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తుండటంతో సల్మాన్ కోపం పెంచుకున్నాడు. మంగళవారం రాత్రి అజీల్ ఇంటికి వెళ్లి, అతనిపై కత్తితో దాడి చేశాడు. తర్వాత ఫోన్ చేసి, అతనితోపాటు కుటుంబసభ్యులను చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.





వైభవోపేతం.. శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

చందుర్తి(వేములవాడ): మండలంలోని మూడపల్లి స్వయంభూ శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం బుధవారం కనులపండువగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత విశాఖ ఇండస్ట్రియల్ డైరెక్టర్ జేపీ రావు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలతోపాటు తలంబ్రాలు తీసుకువచ్చారు. కల్యాణం ఉదయం 11.15 గంటలకు వేదపండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య రెండు గంటలపాటు జరిపించారు. అనంతరం అమ్మవార్లకు మహిళా భక్తులు ఒడిబియ్యం సమర్పించారు. భక్తులకు ఆలయ శాశ్వత చైర్మన్ జేపీ రావు, గ్రామ సర్పంచు చిలుక అంజిబాబులు అన్నదానం చేశారు. హాజరైన ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, నాయకులు శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణానికి ఎమ్మెల్యే రమేశ్ బాబు, చందుర్తి ఎంపీపీ బైరగోని లావణ్య, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, చందుర్తి సింగిల్‌విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, చందుర్తి జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్ ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.